క్లుప్తంగా

విద్యుత్‌కు నేడు అంతరాయం

సీటీఆర్‌ఐ: 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మత్తుల నేపథ్యంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో మేదరపేట, చర్చిపేట, గొల్లమారెమ్మ టెంపుల్ స్ట్రీట్, బెస్తవీధి సచివాలయం, గంటాలమ్మ గుడి వీధి, సౌభాగ్య ఆప్టికల్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

నేడు అవార్డుల ప్రదానం

కడియం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించే కార్యక్రమంలో నాటక కళాకారులైన బొర్రా రామకృష్ణ, శీలం సుబ్బారావు, కొప్పిశెట్టి చిన్న వెంకటరావుకు కందుకూరి నాటకరత్న అవార్డులు అందజేయనున్నట్లు కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తెలిపారు. ఏపీ నాటక దినోత్సవం, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ఫైలేరియా కిట్లు అందజేత

కడియం: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వం సమకూర్చిన ఫైలేరియా కిట్లను మంగళవారం బాధితులకు పంపిణీ చేశారు. సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, వైద్యులు మణిజ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్ల పంపిణీ



ట్రాఫిక్ పోలీసుకు కళ్లజోడు అందిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

సీటీఆర్‌ఐ: ఏవీ అప్పారావు రోడ్డులోని అగర్వాల్ హాస్పిటల్‌లో మంగళవారం సుమారు 300 మంది ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ నిత్యం ఎండలో నిలబడుతూ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి కూలింగ్ కళ్లజోళ్లను అందించడం అభినందనీయమన్నారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సత్తి విజయ్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సత్తి విజయ, డాక్టర్ వర ప్రసాద్ కార్యంశెట్టి, జయకుమార్ రెడ్డి(రీజినల్ మేనేజర్, కార్పొరేట్ రిలేషన్స్ ఏపీ), అఖిల్ (క్లస్టర్ మేనేజర్ ఆపరేషన్స్) పాల్గొన్నారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ

ప్రకాశం నగర్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 31 వరకూ జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 8 నుంచి 14 ఏళ్ల బాల బాలికలు శిక్షణకు అర్హులన్నారు. ఒక్కో శిబిరంలో 25 మంది బాలురు, 25 మంది బాలికలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వివిధ క్రీడా అసోసియేషన్ సభ్యులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు.. క్రీడ పేరు, ప్రాంగణం పేరు, స్థలం, క్రీడా ఇన్‌చార్జి, పేరు, మొబైల్ నంబర్ తదితర వాటితో ఈజీడీఎస్ఏరాజమహేంద్రవరం ఎట్ జీమెయిల్ డాట్‌కామ్‌లో సమాచారం పంపించాలన్నారు. వివరాలకు 90329 34038 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైద్యానికి ఆర్థిక సాయం



ఆటోడ్రైవర్ దుర్గకు ఆర్థిక సాయం అందిస్తున్న రాంబాబు

సీటీఆర్‌ఐ: అంబేద్కర్ ఉత్సవ ర్యాలీ సందర్భంగా క్వారీ మార్కెట్ సెంటర్ లో ప్రమాదం బారిన పడిన గుడ్ల దుర్గ అనే ఆటో డ్రైవర్‌కు వైద్యం కోసం రూ.పది వేల ఆర్థిక సహాయం అందించినట్లు ఆస్క్ చైర్మన్ లయన్ గుబ్బల రాంబాబు అన్నారు. మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసుతో కలిపి మంగళవారం దుర్గ వైద్యం పొందుతున్న హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరమని, దుర్గ త్వరగా కోలుకోవాలని రాంబాబు ఆకాంక్షించారు. ఆపరేషన్ అనంతరం దుర్గ కుటుంబ పోషణకు సహాయం అందిస్తామని ర్యాలీ కన్వీనర్ అజ్జరపు వాసు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ ప్రతినిధి బంటి లోకేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కంబాలచెరువు: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. జాంపేటకు చెందిన మోటూరి బాపనమ్మ (47) ఇంటిలోని టబ్‌లో నీటిని తీస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురైంది. ఆ టబ్‌కు అనుకుని ఉన్న తీగల నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

ఆల్కాట్ గార్డెన్స్‌లో నివాసముంటున్న జలాది రాజేష్ ఈ నెల 14న అదృశ్యమయ్యాడు. తన భార్య వద్ద రూ.వంద తీసుకుని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. భార్య ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

యుగానికొక్కడు..



కందుకూరి దంపతులు నివసించిన పాత ఇల్లు, నేటి నాటక నిలయం



వీరేశలింగం రచించిన పుస్తకాలు

- సాంఘిక దురాచారాలపై పోరాడిన కందుకూరి
- స్త్రీవిద్యకు అత్యంత ప్రాధాన్యం
- నాటకాలతో సామాజిక చైతన్యం
- నేడు వీరేశలింగం జయంతి

సీటీఆర్‌ఐ: అతడు స్త్రీ విద్య కోసం ఉద్యమించిన జ్ఞాన ప్రదాత. బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన స్ఫూర్తి ప్రదాత. బాల వితంతువులకు పునర్వివాహాలు జరిపించిన సంఘ సంస్కర్త. సమాజ సేవ కోసం హితకారిణి సమాజం స్థాపించిన సేవామూర్తి. నాటక కర్త. అతడే.. గోదావరి తీరం రాజమహేంద్రవరంలో నడయాడిన యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం. 1848 ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు ఆయన జన్మించారు. రచయితగా, నాటక కర్తగా, సంఘ సంస్కర్తగా ఆయన ఎనలేని కృషి చేశారు. నాటి సమాజంలోని ఛాందసవాదులను ఎదిరించి ధీరుడిగా నిలిచారు. ఒకవైపు సామాజిక చైతన్యం.. మరోవైపు పురాణ సాహిత్యంపై సామాన్య ప్రజల్లో ఆసక్తి కలిగించడానికి ఆ రోజుల్లో నాటకరంగం ఎనలేని కృషి చేసింది.

రాజమహేంద్రవరం కేంద్రంగా కందుకూరి వీరేశలింగం రచించిన తొలి ప్రదర్శిత నాటకం 'వ్యవహార ధర్మబోధిని' నాడు సంచలనం రేపింది. సామాజిక రుగ్మతలపై కందుకూరి సంధించిన మరో అస్త్రం బ్రాహ్మీవివాహం ఛాందసవాదులు కలవరపడేటట్లు చేసింది. వీరేశలింగం మార్కండేయ మకుటంతో శతకం, శ్రీ రాజమహేంద్ర పురవర గోపాల వంటి పద్య కావ్యాలు, వ్యవహార ధర్మబోధిని, చమత్కార రత్నావళి, అభిజ్ఞాన శాకుంతలం వంటి నాటకాలు, రాజశేఖర చరిత్రము, సత్యరాజా పూర్వదేశ యాత్రలు వంటి రచనలు చేశారు.

తొలి వితంతు వివాహం

వీరేశలింగం పంతులు గారు తన ఇంట్లో 1881 డిసెంబర్ 11న మొట్టమొదటి వితంతు వివాహం జరిపించాడు. బాల వితంతు గౌరమ్మ, రేబూడికి చెందిన గోగులపాటి శ్రీరాములుకు ఈ వివాహం జరిగింది. ఆ సందర్భంగా వంట చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోతే వీరేశలింగం భార్య రాజ్యలక్ష్మమ్మ స్వయంగా వంట చేశారు.

నాటక రంగానికి కందుకూరి విశేష సేవలు అందించారు. నాటక రంగం తన ప్రాభవాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో అప్పటి రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అభ్యర్థన మేరకు నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి.. వీరేశలింగం పంతులు జయంతిని నాటక రంగ దినోత్సవంగా ప్రకటించారు.

నాటక నిలయాన్ని ప్రారంభించాం



ఆనంద్ గార్డెన్‌లోని కందుకూరి వీరేశలింగం ఇంట్లో జక్కంపూడి విజయలక్ష్మి ప్రోత్సాహంతో లక్ష్మీపార్వతితో తెలుగు నాటకం నిలయాన్ని ప్రారంభించాం. తెలుగు నాటకంపై జరిగిన పరిశోధనలు, సాహిత్యాన్ని ఒకచోట నిక్షిప్తం చేయాలన్నదే దీని వెనుక ఉద్దేశం. కందుకూరి చేసిన సేవలు నేటి తరానికి తెలియాల్సి ఉంది.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, కందుకూరి నాటక సాహిత్యంపై పరిశోధకుడు

త్యాగశీలి కందుకూరి



స్త్రీ నుదుట తిలకం దిద్ది, తలరాతనే మార్చిన విధాత కందుకూరి. స్త్రీ విద్య కలిగే లాభాలు అటు సమాజ పరంగా ఇటు కుటుంబ పరంగా ముందుకే గ్రహించిన త్యాగశీలి, సంఘ సంస్కర్త. ఆంధ్ర రాష్ట్రంలోని ప్రతి స్త్రీ వారికి రుణపడి ఉందడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

– కందెపు సునీత, సాహితీవేత్త

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు

కడియం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ సీనియర్ బైపీసీలో జ్యోతుల మహేశ్వరి 954 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సీఈసీలో కె.నాగదేవి 748, సువర్ణ శిరీష 658 మార్కులు సాధించారన్నారు. బైపీసీ, సీఈసీల్లో 40 శాతం ఉత్తీర్ణత పొందారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్కూలు సిబ్బంది గొల్లపల్లి సత్యనారాయణ తదితరులు సత్కరించారు.

వ్యవసాయ యంత్రాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ యాంత్రీకరణతో రైతులు ప్రయోజనం పొందాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజవోలు గ్రామంలో వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలను మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు మాట్లాడుతూ జిల్లాలో 3.92 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ముందుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం లోడు లారీలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.

ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ ఎర్నెస్ట్ మోజెస్

కంబాలచెరువు: ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఫలితాలలో నివ్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. సీనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీలో డి.విజయ్ కుమార్ 966, పి.నవ్యశ్రీ 949, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో సీహెచ్ నాగపద్మాదేవి 955, పి.సునీల్ కుమార్ 944, వి.అభిరూప్ 940 మార్కులు సాధించారన్నారు. జూనియర్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (నర్సింగ్)లో ఎ.పావని 478, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో తోట చరణ్ 456, ఎం.లహరి ప్రియ 464, ఎస్.గుణశేఖర్ 459, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీలో ఎ.హరి 449 మార్కులు సాధించారన్నారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్ గారపాటి ఎలిజబెత్ అభినందించారు.

సొమ్ము అందరిదీ.. సోకు వీరిది..

- బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణానికి అందరి సాయం
- శిలాఫలకంలో సొంత వారికే చోటు
- దాతలను విస్మరించిన వైనం



బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



బాస్కెట్ బాల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

రాజమహేంద్రవరం రూరల్: అధికారాన్ని అడ్డు పెట్టుకుని చెలరేగిపోతున్న నాయకులు దాతలను కూడా విడిచి పెట్టడం లేదు. దాతలు సదుద్దేశంతో చేసిన ఆర్థిక సాయాన్ని తమ ఖాతాలో వేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టును నిర్మించారు. ఆ కోర్టును మంగళవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. గోరంట్ల శాంతారామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించినట్టు శిలాఫలకాన్ని సైతం ఆవిష్కరించారు.

రూ.తొమ్మిది లక్షల ఖర్చు

వాస్తవానికి బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం కోసం సుమారు 9 లక్షల రూపాయలు ఖర్చు అయినట్టు తెలుస్తుంది. వీటిలో జీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.2.50 లక్షలు మాత్రమే సమకూర్చారు. మిగిలిన ఆరున్నర లక్షల రూపాయలకు మెటీరియల్ రూపంలో పలువురు దాతలు అందజేశారు. గ్రౌండ్ ఫిల్లింగ్ కోసం మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు రూ.రెండు లక్షలు విలువైన గ్రావెల్, రెండు టన్నుల ఇనుము, ఇతర మెటీరియల్, నర్సరీ రైతు పల్ల సుబ్రహ్మణ్యం రూ.70 వేలు విలువైన మెటీరియల్, గ్రామంలో పనులు చేసే కాంట్రాక్టర్లు, బిల్డర్లు, సత్యదేవ నర్సరీ రైతు, సుంకర ఫౌండేషన్, ఉపాధ్యాయులు తదితరులు ఆరున్నర లక్షలు కేటాయించినప్పటికీ, వారి పేర్లు మాత్రం శిలాఫలకంలో చోటుచేసుకోలేదు. క్రెడిట్ మొత్తం జీఎస్ఆర్ ఫౌండేషన్‌కే చెందే విధంగా శిలాఫలకం ఏర్పాటు చేయడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం కీ.శే.గోరంట్ల శాంతారామ్ జ్ఞాపకార్థం జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుమారుడు డాక్టర్ గోరంట్ల రవి రామ్‌కిరణ్ రూ.2.50,000 విరాళంతో నిర్మించబడింది. ప్రారంభకులు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అని శిలాఫలకంలో రాయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఎమ్మెల్యే మెప్పు కోసమే..

విద్యార్థులకు, గ్రామంలోని యువకుల కోసం బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మిస్తున్నామని అనగానే దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం అందజేశారు. అయితే ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని మెప్పించడానికి గ్రామస్థాయి నాయకుడు అధికారులపై ఒత్తిడి తెచ్చి జీఎస్ఆర్ ఫౌండేషన్ ఒక్క పేరునే శిలాఫలకంపై ఏర్పాటు చేశారు. దాతలను ప్రోత్సహించేందుకు శిలాఫలకాలను ఏర్పాటుచేయడం పరిపాటి. అయితే కేవలం ఎమ్మెల్యే మెప్పుకోసం అధికార పార్టీ నాయకుడు దాతల స్ఫూర్తిని దెబ్బతీసేలా శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇంత చేసిన సదరు నాయకుడు ఒక్క రూపాయి కూడా బాస్కెట్ బాల్ కోర్టుకు సమకూర్చకపోవడం గమనార్హం.

గుర్తు తెలియని మహిళ మృతి

రాజమహేంద్రవరం రూరల్: దివాన్ చెరువు పంచాయతీ పరిధిలోని శ్రీరామపురం ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తించినట్టు ఆ గ్రామ వీఆర్వో దారా రామజోగి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్, సిబ్బంది ఆ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, సుమారు 20 రోజుల క్రితం మృతి చెందిఉంటుందని భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96533, 94911 22811 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కోరారు.

21 నుంచి స్లాట్ బుకింగ్ విధానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 21 నుంచి స్లాట్ బుకింగ్ విధానం ప్రవేశపెడుతున్న కాకినాడ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ(ఎఫ్ఏసీ) డాక్టర్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆ విధానంపై మంగళవారం సాయంత్రం రాజమండ్రి రిజిస్ట్రార్ కార్యాలయం(ఓబీ)లో సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, 2 రాయి రాంబాబు, కె.పుల్లంరాజు మాట్లాడుతూ స్లాట్ విధానంపై అవగాహన కల్పించారు.

పాస్టర్‌ది ప్రమాదం కాదని నమ్ముతున్నా..



మీడియాతో మాట్లాడుతున్న హర్షకుమార్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని తాను నమ్ముతున్నానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను చాలెంజ్ చేస్తున్నాను. అదే బుల్లెట్‌తో పోలీసుల సమక్షంలో నేను వెళ్తాను. ఎలా చనిపోతానో చూస్తాను' అని అన్నారు. పోలీసుల విచారణపై ప్రెస్‌మీట్ పెట్టిన ఐజీ అశోక్ కుమార్ ఇన్వెస్టిగేషన్ అధికారి కాదని చెప్పారు. ఎస్పీ కూడా ఇన్వెస్టిగేషన్ అధికారి కాదని, మరి వారు ఏవిధంగా దర్యాప్తు చేశారని ప్రశ్నించారు. పోలీసులు విడుదల చేయకముందే సీసీ ఫుటేజీలు రావడంపై అనేక అనుమానాలున్నాయన్నారు. ఆ సీసీ ఫుటేజీలను పోలీసులే ప్రజలతో విడుదల చేయించారని, ప్రవీణ్ పగడాల తాగుబోతని చెప్పడానికే వీడియోలు అలా చేశారని ఆరోపించారు. ఈ వీడియోలు వాస్తవమని కూడా తాను నమ్మడం లేదన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలో ఉన్న కొంతమంది మతోన్మాదులు ఈ దేశం నుంచి క్రైస్తవులను తరిమికొట్టాలని చూస్తున్నారన్నారు. హిందువులు మైనారిటీలైపోతారంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. నిజంగా రోడ్డు ప్రమాదమే అయితే ప్రవీణ్ పగడాల ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను ఎందుకు తీసుకు వెళ్లారని ప్రశ్నించారు. బ్యాంకు అకౌంట్ ఎందుకు సీజ్ చేశారో కూడా తెలియాలన్నారు. ప్రవీణ్ ప్రగడాలది ప్రమాదం కాదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ప్లాన్ చేశాయని ఆరోపించారు. ఐజీ అన్ని ఫుటేజీలు సంపాదించి, ప్రమాదం జరిగిన చోట ఎందుకు సంపాదించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకా చాలామంది పాస్టర్లను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. లౌకికవాదులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్నామని, దీనికి అందరూ తరలి రావాలని హర్ష కుమార్ కోరారు.

ప్రవేశ పరీక్షలకు ఆర్ట్స్ కళాశాలలో శిక్షణ



శిక్షణ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: ఏపీ పీజీ సెట్, ఐసెట్ తదితర ప్రవేశ పరీక్షలకు ఆర్ట్స్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోచింగ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తయ్యాక విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. అలాంటి వారికి తమ కళాశాల తరఫున శిక్షణ ఇస్తామన్నారు. ఇది ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మోడ్‌లలో అందుబాటులో ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పీజీ కోచింగ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున్ మాట్లాడుతూ కోచింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు బ్రోచర్‌లో పొందుపరిచామని, అలాగే కళాశాల అధికారిక వెబ్‌సైట్ 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీసీఆర్‌జేవై.ఎసి.ఇన్‌ను సందర్శించాలని సూచించారు.

17న సీపీఐ నాయకుల పర్యటన

ప్రకాశం నగర్: ఇంటి అద్దెలు కట్టలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి గోడును వినేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఈ నెల 17న రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఆయన మంగళవారం అల్యూమినియం కాలనీ, వీరభద్రనగర్, శేషయ్య మెట్ట ప్రాంతాల్లో పర్యటించారు.

అమ్మ ఉత్సవం.. వైభవోపేతం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట నరసింహారావుపేటలో కన్నమాంబ పేరంటాలమ్మ జాతరను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. కన్నమాంబవీధి నుంచి కన్నమాంబ పేరంటాలు అమ్మవారి ఘటాలను చీరలపై పురవీధులలో ఊరేగించారు. పూలగరగలు, సేవగరిడి, గుర్రాలు, ఎలుగు బంట్లు, బండ్ల వేషాలు, సినీనటుల డూపులు, డీజే డ్యాన్సులు, బాణసంచా కాల్పులు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో టూటౌన్ ఇన్‌స్పెక్టర్ శివ గణేష్, ఎస్సై, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి చల్ల ఘటాల ఊరేగింపు



డూపు హీరోల సందడి



కోలాట ప్రదర్శన



నృత్యాలు

అనుకోని వాన.. రైతుల ఆవేదన



మురమండలో కోతకు సిద్ధమైన వరిచేను

- కోతకు వచ్చిన రబీ వరి పంట
- అన్నదాతలను హడలెత్తిస్తున్న వరుణుడు
- కోతలకు వెనుకాడుతున్న వైనం

కడియం: వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో మూడు రోజులుగా పలు చోట్ల వర్షం కురుస్తోంది. దీంతో కోతకు వచ్చిన వరి చేలను కోసేందుకు రైతులు వెనుకాడుతున్నారు. కడియం మండల పరిధిలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల గ్రామాల్లో 2,623 హెక్టార్లలో వరిని సాగు చేస్తున్నారు. వీటిలో ఎంటీయూ 1121 రకాన్ని ఎక్కువగా పండిస్తున్నారు. బొండాలు, సన్నాల రకాలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ప్రస్తుతం పంట కోతలకు సిద్ధమైంది. దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉంటాయని రైతులు భావిస్తున్నారు. అయితే మూడు, నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పది శాతం కోతలు

ఇప్పటి వరకూ రబీ పంటలో పది శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. వర్షాలు పడుతుండడంతో కోతలు కోసేందుకు రైతులు వెనుకాడుతున్నారన్నారు. ఒకవేళ కోత పూర్తయిన తర్వాత వర్షం మొదలైతే ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తుందని భావిస్తున్నారు. తడిసిన ధాన్యం ఆరబెట్టుకోవడం వీలు కాక ధాన్యం మొలకెత్తితే ఎక్కువ నష్టాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే పంట కోత కోసిన రైతులకు బస్తాకు 8 కేజీలు తగ్గించి ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలు సాగిస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో వరుణ గండం ఎలా గట్టెక్కుతుందా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.

మొలకలు రాకుండా చూసుకోవాలి

వర్షం కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం మొలకలు రాకుండా జాగ్రత్త పడాలి. ఉప్పు నీటిని స్ప్రే చేసుకోవడం, ధాన్యంపై సక్రమంగా టార్పాలిన్లు కప్పుకోవడం వంటివి చేపట్టాలి. ఈదురు గాలుల కారణంగా అక్కడక్కడా పంట నేలకొరిగింది. వర్షం కురిసినప్పటికీ ఎప్పటికప్పుడు నీరు బయటకు ప్రవహిస్తుండడంతో ప్రస్తుతానికి ఇబ్బంది లేదు.

– కె.ద్వారకాదేవి, వ్యవసాయాధికారి, కడియం